సాక్షి ఒడిశా

శుక్రవారం : 14 : ఏప్రిల్ : 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,61,364లు, బంగారం 4.7 గ్రాములు, వెండి 108 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



విజయమే లక్ష్యంగా పనిచేయాలి - 8లో



పనివేళలపై ప్రభావం - 8లో

న్యూస్‌రీల్

జయపురంలో 144 సెక్షన్


OFFICE OF THE SUB-COLLECTOR & SDM, JEYPORE

సబ్ కలెక్టర్ జారీచేసిన ప్రకటన

జయపురం: స్థానిక సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 13 నుంచి 20వరకు 144 సెక్షన్ విధిస్తున్నట్లు సబ్ డివిజనల్ అధికారి దేవధర ప్రధాన్ గురువారం ప్రకటించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగవచ్చనే ఉన్నతాధికారుల సమాచారం మేరకు ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇద్దరికంటే ఎక్కువ మంది గుమిగూడవద్దని, ఆందోళనలకు దూరంగా ఉండాలని సూచించారు. వివాదాలకు అవకాశం కల్పించే పరిస్థితులకు ప్రజలు కూడా దూరంగా ఉంటూ సహకరించాలని ఆయన కోరారు.

విప్పపూలతో నిందితుడి అరెస్ట్



పోలీసులు సీజ్ చేసిన వాహనం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి ఎక్సైజ్ పోలీసులు విప్పపూలను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. మత్తిలి సమితి క్యేంగ్ పంచాయతీ సమీపంలోని వంతెన వద్ద ఎక్సైజ్ సిబ్బంది గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో పికప్ వ్యాన్‌లో అక్రమంగా విప్పపూలు రవాణా చేస్తున్న వ్యక్తిని గుర్తించి, అరెస్ట్ చేశారు. విప్పపూలు ఇతర రాష్ట్రాలకు రవాణా కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విశాల్ సింగ్, అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలోనే పెట్రోలింగ్ ప్రారంభించారు. నిందితుడు మత్తిలికి చెందిన సురేష్ పూజారి(25) నుంచి 55బస్తాల్లో 1925కిలోల విప్పపూలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, సాయంత్రం కోర్టులో హాజరు పరిచారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి



పొలంలో మృతిచెంది ఉన్న ఆవులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి గ్రామంలో విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. డెరాకోన గ్రామానికి చెందిన నిశ్రా గౌడోకు చెందిన ఆవులు మేత కోసం సమీపంలోని పొలంలోకి చొరబడ్డాయి. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం స్పర్శతో ఆవులు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. చెట్టు విద్యుత్ తీగకు తగలడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు.

నవజాత శిశువు లభ్యం



శిశువుతో ఆస్పత్రి వద్ద గ్రామస్తులు

రాయగడ: అప్పుడే పుట్టిన పసికందును గ్రామస్తులు అక్కున చేర్చుకుని పోలీసులకు అప్పగించిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. సికరపాయి జొడియా వీధివైపు వెళ్తున్న గ్రామస్తులకు పసికందు ఏడుపు వినిపించింది. దీంతో పరిశీలించి చూడాగా అప్పుడే జన్మించిన ఆడశిశువును గుర్తించారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయగా, ఐఐసీ ముకుందదేవ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని, శిశువును సికరపాయి ఆస్పత్రికి తరలించారు. 2కిలోల బరువు ఉన్న పసికందు.. ఆరోగ్యంగా ఉందని వైద్యులు ప్రకటించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. శిశువును శిశుసంరక్షణ కార్యాలయానికి చెందిన అధికారులకు అప్పగించారు.

నామినేషన్లు షురూ..

- ఝార్సుగుడ ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ
- ఈనెల 20 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం
- మే 10న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు
- పూర్తయిన ప్రధాన పార్టీల అభ్యర్థుల జాబితా



టొంకొధొరొ త్రిపాఠి, బీజేపీ | దీపాలీదాస్, బీజేడీ | తరుణ్ పాండే, కాంగ్రెస్



భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. మే 10న ఉప ఎన్నిక జరుగుతుందని గురువారం జారీ అయిన అధికారిక నోటిఫికేషన్ స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో అభ్యర్థులు నామినేషన్ దాఖలు ప్రక్రియను ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 29న ఝార్సుగుడ ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్‌ను పోలీసు ఏఎస్‌ఐ హత్య చేయడంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికను భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ముందుగా ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం నుంచి ఆరంభమైన నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈనెల 20వ తేదీతో ముగుస్తుంది. 21న పత్రాలను పరిశీలించి, 24వరకు పోటీ నుంచి వైదొలిగే ఉపసంహరణకు గడువు కేటాయించారు. అనంతరం పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితా జారీ చేస్తారు. మే 10న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహిస్తారు. అదేనెల 13న ఓట్లు లెక్కింపు పూర్తి చేసి, విజేతను ప్రకటిస్తామని జాతీయ ఎన్నికల సంఘం తెలిపింది.


త్రిముఖ పోరు..

ఝార్సుగుడ ఉప ఎన్నికలో త్రిముఖ పోటీ ఉంటుంది. మూడు ప్రధాన రాజకీయ పార్టీలు అధికార బిజూ జనతాదళ్, ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ వాతావరణం నెలకొంది. ఈ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. 2024లో జరగనున్న లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల వ్యవధిలో ఇదే చిట్టచివరి ఉప ఎన్నిక కావచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఝార్సుగుడ ఎన్నికపై ప్రాధాన్యత సంతరించుకుంది.

బరిలో ప్రధానంగా..

హత్యకు గురైన నాయకుడు, మాజీమంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలీ దాస్‌ను బీజేడీ బరిలోకి దింపింది. కాంగ్రెస్ పార్టీ ఇదే పంథాలో ఇటీవల మృతిచెందిన స్థానిక మాజీ ఎమ్మెల్యే భీరెన్‌పాండే కుమారుడు తరుణ్ పాండేను అభ్యర్థిగా ప్రకటించింది. భీరెన్ ఝార్సుగుడ నియోజకవవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన పట్ల సానుభూతి తరుణ్ పాండే విజయాన్ని ప్రభావితం చేస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఇదిలా ఉండగా ప్రధాన విపక్షం బీజేపీ టొంకొధొరొ త్రిపాఠిని ఝార్సుగుడ ఉప ఎన్నికకు అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన బీజేపీ యువమోర్చా మాజీ అధ్యక్షుడు. ప్రస్తుతం పార్టీ రాష్ట్రశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 41ఏళ్ల యువజన నాయకుడు, విద్యాధికుడు. అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించి ఝార్సుగుడ నియోజకవర్గ వ్యాప్తంగా బలమైన ప్రజాధరణ కలిగిన అభ్యర్థిగా గుర్తింపు పొందారు. బీజేడీ అభ్యర్థి దీపాలి దాస్‌కు దీటైన పోటీతో పరాజయం పాలు చేయగలిగే సత్తా ఉన్న అభ్యర్థిగా చర్చ సాగుతోంది.

సంబరాలకు సర్వం సిద్ధం



సంబరాలకు సిద్ధమవుతున్న తేజస్విని గ్రౌండ్

- రాయగడలో మూడు వేదికలపై పొనా సంబరాలు

రాయగడ: ఈ ఏడాది రాయగడలో మూడు వేదికల్లో పొనా సంక్రాంతి ఉత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి వేదికలు కూడా సిద్ధమయ్యాయి. పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో, తేజస్విని హోటల్ ఓపెన్ గ్రౌండ్‌లో, అశోక్ కల్యాణ మండపంలో ఒడియా ప్రజల నూతన సంవత్సరాది సంబరాలకు వేదికలు సిద్ధమయ్యాయి. ఇప్పటి వరకు ఒకే వేదికపై నిర్వహించే ఈ సంబరాలు ఈసారి మూడు వేదికలకు పెరిగాయి. దీనికి సంబంధించి వేదికలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. తేజస్విని వద్ద జరగనున్న సంబరాలు శుక్రవారం ఒకేరోజు జరగనుండగా, గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో 14, 15 తేదీల్లో జరిపేందుకు రంగం సిద్ధం చేశారు.

తేసస్విని గ్రౌండ్‌లో..

తేజస్విని గ్రౌండ్‌లో జరగనున్న పొనా సంక్రాంతి సంబరాలకు డియా భజన గాయకురాలు మానసీ పాత్రొ, రవినారాయణ దాస్ హాజరు కానున్నారు. అలాగే ప్రముఖ బాలీవుడ్ గాయకుడు ఆర్ మహ్మద్, ఒలీవుడ్ గాయకురాలు దీప్తి రేఖ, తారీఖ్ అజీజ్ ప్రేక్షకులను వారి గానామృతంతో ముగ్ధలను చేయనున్నారు.

గోవింద చంద్రదేవ్ మైదానంలో..

గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న పొనా సంబరాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక హాజరవ్వనున్నారు. అదేవిధంగా గౌరవ అతిథులుగా కొరాపుట్ లోక్‌సభ సభ్యుడు సప్తగిరి ఉలక, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగొ, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ శుభ్రా పండా హాజరు కానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ నేపథ్య గాయకులు అనన్య సాహు, రాజ్‌కిషోర్, కుమార్ దీపక్, స్మృతి రథొ, అనీల్ పండా, లిప్సా పండా, రితురాజ్ మహంతి తదితరులు పాల్గొనున్నారు.

కొట్‌పాడ్‌లో విజయానికి కృషిచేయాలి

జయపురం: కాంగ్రెస్‌కు కంచుకోటగా పేరొందిన కొట్‌పాడ్ విధానసభ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు మీనాక్షి బాహినీపతి సూచించారు. కొట్‌పాడ్‌లో ఆమె పార్టీ శ్రేణులతో గురువారం సమావేశమయ్యారు. ఇందులో కుంద్రా, బొయిపరిగుడ, కొట్‌పాడ్, బొరిగుమ్మ సమితిల నుంచి వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మణిప్రసాద్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొట్‌పాడ్ నియోజకవర్గం గతంలో హస్తం పార్టీకి కంచుకోటగా ఉండేదని, పార్టీ టిక్కెట్టుపై చంద్రశేఖర మాఝి విజయం సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే స్వయంకృత అపరాధం కారణంగా గత ఎన్నికలో ఓటమి పాలైన ఆయన.. అనంతరం పదవులపై ప్రేమతో కాంగ్రెస్‌ను వీడారని దుయ్యబట్టారు. అయితే దీనివల్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదని, ప్రజలు, కార్యకర్తలు తమ వెంటే విశ్వాసం వ్యక్తంచేశారు. నవీన్ పట్నాయక్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని, పథకాల పేరుతో ప్రజలను మభ్య పెడుతూ నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాలు కనీస మౌలిక సౌకర్యాలకు నోచుకోవడం లేదని, తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని దుయ్యబట్టారు. దీనిపై కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బొరిగుమ్మ సమితి పార్టీ అధ్యక్షుడు అశోక్ సామంతరాయ్, పీసీసీ సభ్యులు రామచంద్ర పాఢి తదితరులు ప్రసంగించారు.

26న కృష్ణచంద్ర గజపతి జయంత్యుత్సవం



సన్నాహక సభలో మాట్లాడుతున్న కలెక్టర్ లింగరాజ్ పండా

- ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని పాలనాధికారి కార్యాలయంలో మహారాజా కృష్ణచంద్రగజపతి నారాయణదేవ్ 131వ జయంతి ఉత్సవానికి సంబంధించి సన్నాహక సభ గురువారం జరిగింది. ఈనెల 26న జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన చర్చించగా, అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, ఉత్కళ హితేషిణీ సమాజ్ దక్షిణ ఒడిశా ప్రహరి పూర్ణచంద్ర మహాపాత్రొ, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, సూర్యనారాయణ పట్నాయక్(జిల్లా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు), జిల్లా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, రఘునాథ పాత్రొ, పురపాలక మాజీ చైర్మన్ నృసింహచరణ్ పట్నాయక్, బీజేడీ మహిళా కార్యదర్శి సంయుక్తా బెహరా, మీడియా ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా కృష్ణచంద్ర గజపతి సమాధి వద్ద పుష్పాంజలి, ప్యాలెస్ వద్ద అలంకరణ, పాతబస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి పుష్పమాలలు వేయడం, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు.

హరిశ్చంద్ర యోజన సహాయ పరిమితి విస్తరణ

- సీఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: ఆత్మీయుల అంత్యక్రియల నిర్వహణలో పేదలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరిశ్చంద్ర సహాయ యోజనను ప్రారంభించింది. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో రూ.2వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.3వేలు చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఈ సహాయ పరిమితిని విస్తరించినట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం ప్రకటించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.2000 నుంచి రూ.3,000 పట్టణ ప్రాంతాల్లో రూ.3,000 నుంచి రూ.4,000కి పెంచారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామ పంచాయతీలో రూ.15,000తో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటవుతుందని తెలిపారు. హరిశ్చంద్ర సహాయ యోజన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదల చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు కోసం సీఎం సహాయనిధి నుంచి సమగ్రంగా రూ.10.19 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశారు. ఈ పథకం కార్యాచరణ బాధ్యతలు గ్రామ పంచాయతీ విస్తరణ అధికారి లేదా మండల స్థాయి విస్తరణ అధికారికి కేటాయించారు. తాజా సవరణలు పుస్కరించుకుని హరిశ్చంద్ర సహాయ యోజన సాఫ్ట్‌వేర్‌లో అనుబంధ సవరణలతో మెరుగుపరిచారు. దీనిలో జిల్లాల వారీగా గ్రామ పంచాయతీ జాబితా అందుబాటులో ఉంటుంది.

‘అభివృద్ధి పనులపై ఆరోపణలు అర్థరహితం’



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపాలిటీ చైర్మన్ మహంతి

జయపురం: పట్టణంలోని చారిత్రాత్మక జగన్నాథ సాగర్ అభివృద్ధి పనుల్లో బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలు సత్య దూరమని జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి స్పష్టం చేశారు. నిర్మాణాల్లో నాణ్యత లేదని, అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయనేది సరికాదని విమర్శించారు. మున్సిపాలిటీ కౌన్సిల్ సభాగృహంలో గురువారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్నాథ సాగర్ అభివృద్ధి పనులపై వివరణ ఇచ్చారు. ప్రజల డిమాండ్ మేరకు జిల్లా కలెక్టర్ సునాబెడ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్) అధికారులను కలిసి జగన్నాథ సాగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారని గుర్తుచేశారు. అనంతరం రూ.8.53 కోట్ల అంచనాతో అభివృద్ధి ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ఇందులో ముందుగా రూ.కోటి ఇచ్చేందుకు హాల్ అధికారులు అంగీకరించారని, ఈ మేరకు మున్సిపాలిటీతో ఒప్పందం కుదుర్చుకుందని పేర్కొన్నారు. ముందు నిర్ణయం ప్రకారం షెడ్యూల్, నాన్ సెడ్యూల్ పనులకు రూ.1.60 కోట్లు ఖర్చు చేసేందుకు సాంకేతిక, పరిపాలనా అనుమతులు తీసుకున్నామని వివరించారు. ఒడిశా పీడబ్ల్యూడీ కోడ్, అనాలిసిస్ ఆఫ్ రేట్స్ మేరకు కేవలం షెడ్యూల్ పనులు మాత్రమే చేపడుతున్నామని, సివిల్ పనులకు సంబంధించి టెండర్లు పిలిచామని వివరించారు. ఇప్పటి వరకు హాల్ నుంచి రూ.1.80 కోట్లు విడుదలయ్యాయని స్పష్టంచేశారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు పనులు జరుగుతున్నాయని, బీజేపీ నేతలు ఆలోచించి, విమర్శలు చేయాలని హితవు పలికారు.

సెంచూరియన్‌లో ఉచిత వేసవి శిక్షణ



మాట్లాడుతున్న డీసీపీయూ అరుణ్‌కుమార్ త్రిపాఠి

పర్లాకిమిడి: జిల్లాలోని ఆర్.సీతాపురం క్యాంపస్ సెంచూరియన్ వర్సిటీలో పేద విద్యార్థులకు ఈ వేసవిలో 4నెలలు ఉచితంగా శిక్షణ అందించేందుకు వర్సిటీ అధికారులు ముందుకు వచ్చారు. ఇందులో 20మంది తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల ఎంపికను ఇప్పటికే పూర్తిచేశారు. వీరికి ఉన్నత విద్యాభ్యాసం, ఆటలు, కళలు, చేతి వృత్తులపై శిక్షణ అందిస్తామని సెంచూరియన్ ఐటీసీ(ఇండస్ట్రీయల్ టెక్నికల్ ఎడ్యుకేషన్) డైరెక్టర్ సదాత్ అలీ తెలిపారు. గత ఐదు దశాబ్దాలుగా ఎస్‌ఓఎస్ ఎన్జీఓ సంస్థ(భువనేశ్వర్) పేద విద్యార్థుల చదువులకు సహకారం అందిస్తోందని శివశంకర్ పాత్రొ పేర్కొన్నారు. తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా శిశు సంరక్షణాధికారి(డీసీపీయూ) అరుణ్‌కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వ్యవస్థాపక దినోత్సవం

- వేడుకలను ప్రారంభించిన స్పీకర్ అరూఖ్

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని 75వ వ్యవస్థాపక వార్షికోత్సవం గురువారం ప్రారంభమైంది. 3 రోజుల పాటు సాగే ఈ వేడుకలను స్పీకర్ విక్రమ్‌కేశరి అరూఖ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా భువనేశ్వర్‌లోని జయదేవ్ భవనంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర సమాచారం–ప్రజా సంబంధాల శాఖామంత్రి ప్రదీప్‌కుమార్ ఆమత్ సందర్శించారు. ఉత్కళ ప్రసంగ్ సంపాదకురాలు కస్తూరి మహాపాత్రొ పాల్గొన్నారు. కొత్త రాజధాని శిలాన్యాస ఫలకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ సులోచన దాస్, స్థానిక ఎమ్మెల్యేలు, అభివృద్ధి కమిషనర్ ఇతరేతర ఉన్నతాధికారులు పాలుపంచుకున్నారు. నగరవ్యాప్తంగా ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు పలు విన్యాసాలు ప్రదర్శించారు. స్పీకర్ విక్రమకేశరి అరూఖ్ విద్యార్థుల పరేడ్ కవాతు స్వీకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన స్కేటింగ్, డేర్ డెవిల్ ఇతరేతర విన్యాసాలు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్థానిక ఉత్కళ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఫొటో ప్రదర్శన ప్రారంభిస్తున్న మంత్రి ప్రదీప్‌కుమార్ ఆమత్



రాజధాని నగరం శిలాఫలకం వద్ద పుష్పాలను అలంకరిస్తున్న స్పీకర్ విక్రమకేశరి అరూఖ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న స్పీకర్ అరూఖ్



విద్యార్థుల డేర్ డెవిల్ విన్యాస ప్రదర్శన



ఫొటో ఎగ్జిబిషన్ సందర్శిస్తున్న మేయర్ సులోచన దాస్

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడికి చెందిన ఎస్.అప్పారావు, పద్మావతి దంపతులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆలయ సిబ్బంది ఇప్పిలి రంజిత్ శర్మ, బి.ఎస్.చక్రవర్తిలకు విరాళ చెక్కు అందజేశారు. అనంతరం ఆదిత్యున్ని దాతలు దర్శించుకున్నారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శంకరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాది కొమర శంకరరావుని ప్రభుత్వం మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. శంకరరావును జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యావు, ప్రతినిధులు, న్యాయవాదులు గురువారం అభినందించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం నుంచి శ్రీకాకుళం పట్టణానికి అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని గురువారం అల్లినగరం సమీపంలో విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూశాఖల అధికారులు పట్టుకున్నారు. ఈ బియ్యం విలువ రూ.24320గా గుర్తించారు. గుడ్ల ధనుంజయ్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఆటో సీజ్ చేసి, డ్రైవర్‌పై శ్రీనువాసరావుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, సిబ్బంది కెల్ల అప్పన్న, ఈశ్వరరావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ గురుకుల పాఠశాలలు ఎస్ఎం పురం (బాలురు), వమరవల్లి (బాలికలు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్, ఎస్ఎంపురం గుకులం ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు గురువారం చెప్పారు. 5వ తరగతిలో పూర్తిసీట్లు, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24లోపు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీ గురుకులాల్లోని ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రవేశాలకు సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9866559611, 9866559612 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇసుక లారీలు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. చిలకపాలెం వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన ఇసుకను మైన్స్ విభాగానికి అప్పగించి కేసు నమోదు చేశారు.

బుడంబో ఆశ్రమ హెచ్‌ఎం సస్పెన్షన్ ఎత్తివేత

మందస: మండలంలోని బుడంబోకాలనీ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన సవర ఆనందరావుపై ఐటీడీఏ విధించిన సస్పెన్షన్ ఎత్తివేశారు. ఆశ్రమంలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో అప్పట్లో ఐటీడీఏ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా పీఓ బి.నవ్య సస్పెండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఆనందరావును సోంపేట మండలం మాలగోవిందపురం గిరిజన ఆశ్రమం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా నియమించారు.

బిలాయిలో రణస్థలం విద్యార్థి అదృశ్యం

రణస్థలం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయి ఐఐటీ(రాయిపూర్)లో చదువుతున్న జె.ఆర్.పురం పంచాయతీ లక్ష్మీనగర్‌కు చెందిన వట్టి అసిరప్పడు కుమారుడు ఈశ్వర్‌చంద్ అదృశ్యమయ్యాడు. మార్చి 7 నుంచి కుమారుడు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి వెళ్లి ఆరా తీసినా ఫలితం లేకపోయింది. బిలాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఆచూకీ లభించలేదు. అక్కడి పోలీసులు సరిగ్గా దర్యాప్తు చేయడం లేదని, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని తమ కుమారుడి ఆచూకీ దొరికేలా చర్యలు తీసుకోవాలని అసిరప్పడు వేడుకుంటున్నారు.

నేటి అర్ధరాత్రి నుంచే వేటకు విరామం

అరసవల్లి: సముద్రంలో చేపల సంతానోత్పత్తి కోసం శుక్రవారం అర్ధరాత్రి నుంచే తీర ప్రాంతాల్లో చేపల వేటపై నిషేధ ఆంక్షలు అమలులోకి రానున్నాయి. ఈ మేరకు మత్స్యశాఖ డీడీ పీవీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ నిబంధనలు వచ్చే జూన్ 14 అర్ధరాత్రి వరకు అమలులో ఉంటాయని, మత్స్యకారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. లేదంటే ప్రభుత్వం అందించే రాయితీలు రద్దవుతాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 11 మండలాల తీర ప్రాంత మత్స్యకారులకు ఈ నిబంధనలు తప్పనిసరి చేశామని, నిఘా కూడా ఉంటుందని స్పష్టం చేశారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- రాష్ట్రమంత్రి అతాను సవ్యసాచి నాయక్
- బీజేడీ కార్యకర్తలు, నాయకులతో సమన్వయ సమావేశం


మిషన్‌శక్తి సంఘాలకు చెక్కు అందిస్తున్న రాష్ట్రమంత్రి అతాను సవ్యసాచి నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని మోహానా, పర్లాకిమిడి నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, సహకార సంఘాలశాఖ మంత్రి అతాను సవ్యసాచి నాయక్ పిలుపునిచ్చారు. పర్లాకిమిడిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో బీజేడీ జిల్లాస్థాయి సమన్వయం సమావేశం గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా పర్యవేక్షకుడిగా ఇటీవల నియమితులైన మంత్రి.. తొలిసారిగా స్థానిక కార్యకర్తలతో భేటీ అయ్యారు. బిజూ పట్నాయక్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, నివాళులర్పించారు. జిల్లాలోని 7 మండల కేంద్రాల నుంచి జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, బీజేడీ బ్లాక్‌స్థాయి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అంతకుముందు మంత్రికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్ సర్క్యూట్ హౌస్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల సర్వేలు బీజేడీకి అనుకూలంగా వినిపిస్తున్నాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బరంపురం లోక్‌సభ స్థానంతో పాటు, పర్లాఖెముండి, మోహానా అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయం సాధించే విధంగా ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. గతసారి ఎన్నికల్లో తలెత్తిన తప్పిదాలు ఈదఫా జరగబోవని, జిల్లాలోని 2 అసెంబ్లీ స్థానాల్లో బీజేడీ విజయదుందుభి మోగించాలని ఎంపీ చంద్రశేఖర సాహు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు పేర్కొన్నారు. సమావేశంలో తాటిబెల్లం కో-ఆపరేటివ్ డైరెక్టర్ దొరబాబు, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మరియం రైతో, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీరాజు, జెడ్పీటీసీ(గుసాని-1) ఎస్.బాలరాజు, సీనియర్ నాయకులు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, యువరాణి కల్యాణీదేవి గజపతి, ఎన్ఏసీ మాజీ చైర్మన్ అంతర్యామి గమాంగో, బీజేడీ పట్టణ అధ్యక్షుడు సిత్తు మహాపాత్రొ, రాష్ట్ర కార్యదర్శి మారుత్ పాలో, కాశీనగర్ ఎన్ఏసీ వైస్ చైర్మన్ రఘురాం సాహు, బసంత్ దాస్, మోహానా బ్లాక్ అధ్యక్షుడు దండాశి సాహు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు రుణమేళా

పర్లాకిమిడి: రాష్ట్రంలో మహిళల ఆర్థిక ప్రగతికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి అతాను సవ్యసాచి నాయక్ పేర్కొన్నారు. మిషన్‌శక్తిలో పనిచేస్తున్న 101 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.4,14,50,000ల వడ్డీలేని రుణాలు మంజూరు కావడమే దీనికి ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. జిల్లా కేంద్రంలోని గజపతి స్టేడియంలో గురువారం నిర్వహించిన మిషన్‌శక్తి కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆత్మనిర్భర, ఆర్థిక స్వావలంబనకు మిషన్‌శక్తి విభాగం ద్వారా ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఎస్‌హెచ్‌జీ సంఘానికి రూ.5 లక్షల చొప్పున్న వడ్డీలేని రుణాలు అందిస్తోందని తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధాన్యం, పిండిమిల్లు యంత్రాలు, చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ చంద్రశేఖర సాహు, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో, పురపాలక వైస్ చైర్మన్ లెంక మధు, ఏడీఎం సంగ్రాంశేఖర పండా, జిల్లా కార్య నిర్వాహనాధికారి డీఆర్‌డీఏ రమాంచల్ ఖమారి, ఐటీడీఏ పీఓ ఫాల్గుని మాఝి, జిల్లా సామాజిక సురక్ష అధికారి సంతోష్‌కుమార్ నాయక్, మిషన్‌శక్తి డీపీసీ రస్మిరంజన్ శెఠి, జిల్లా పరిశ్రమల అధికారి సునారం సింగ్ తదితరులు పాల్గొన్నారు.


బీజేడీ జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు


రుణమేళాకు హాజరైన మహిళా సంఘాల ప్రతినిధులు

ఉత్తమ పాఠశాల.. రైల్వేస్కూల్

- రాష్ట్రప్రభుత్వం నుంచి రూ.లక్ష నగదు పురస్కారం
- మేధావంతుల జాబితాలో పలువురు విద్యార్థులకు చోటు



రైల్వే పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథి బృందం

భువనేశ్వర్: అత్యుత్తమ ఫలితాలతో ఖుర్దారోడ్ తూర్పుకోస్తా రైల్వే మిశ్రమ ఉన్నత పాఠశాల అగ్రస్థానంలో నిలిచింది. ఖుర్దా జిల్లా జట్నీ మండలం పరిధిలో వరుసగా రెండేళ్లు ఉత్తమ పాఠశాలగా గుర్తింపు సాధించి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.లక్ష నగదు పురస్కారం అందుకోవడం విశేషంగా పాఠశాల ప్రిన్సిపాల్ సబితకుమారి తెలిపారు. పాఠశాల వార్షికోత్సవం పురస్కరించుకుని ఆమె వివరించిన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. కరోనా తాకిడితో గత 2 ఏళ్లుగా వార్షికోత్సవం నివారించినట్లు గుర్తుచేశారు. 2021, 2022 సంవత్సరాల్లో రైల్వే పాఠశాల ఉత్తమ పాఠశాలగా రాష్ట్రప్రభుత్వం గుర్తింపు సాధించిందన్నారు. ఈ పాఠశాల ఒడియా మాధ్యమ విద్యార్థులు ముఖ్యమంత్రి మేధా భృతికి యోగ్యమైన ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 2021, 22లో మెట్రిక్యులేషన్(పదో తరగతి) బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఉత్తీర్ణులుగా నిలిచి ముఖ్యమంత్రి మేధా భృతికి అర్హత సాధించారు. ఈ జాబితాలో సమగ్రంగా 10మంది విద్యార్థులు స్థానం సాధించడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మేధా భృతి మంజూరు చేసింది. మరో నలుగురు ముఖ్యమంత్రి భాషా భృతి పొందేందుకు అర్హత సాధించారు. రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్ఈ) నిర్వహించిన పదో తరగతి వార్షిక పరీక్షల ఒడియా భాషలో 90శాతం పైబడి మార్కులు సాధించి ఈ భృతికి అర్హత సాధించారు. వీరిలో ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ముఖ్యమంత్రి భాషా భృతి మంజూరైనట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు అర్హత సాధించారు. వీరికి వరుసగా 4 ఏళ్ల పాటు ఏటా రూ.12,000ల చొప్పున మంజూరవుతుందని వివరించారు.

శతశాతం ఉత్తీర్ణత..

10వ తరగతి వార్షిక పరీక్షల్లో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) పదో తరగతి వార్షిక పరీక్షల్లో 98శాతం, ప్లస్2 శ్రేణిలో 95శాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నత పాఠశాల గుర్తింపు సొంతం చేసుకున్నట్లు ప్రకటించారు. క్రీడలు, సాంస్కృతిక, సాంఘిక సేవా కార్యకలాపాల్లో పాఠశాల విద్యార్థులు ముందంజలో ఉంటున్నారు.

వార్షికోత్సవం సృజనాత్మకం..

వార్షికోత్సవం పురస్కరించుకుని పలు సృజనాత్మక సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులు ప్రదర్శించారు. వర్తమాన పరిస్థితులకు అద్దంపట్టే పలు అంశాల ఇతివృత్తంగా ప్రదర్శించిన కార్యక్రమాలు అతిథులు, ప్రేక్షకులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవానికి తూర్పుకోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి డీఆర్ఎం రింకేష్‌రాయ్, మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు శుభలక్ష్మి జెనా, అదనపు మండల రైల్వే అధికారి(ఓపీ) కల్యాణ్ పట్నాయక్, ఇంఫ్రా ఏడీఆర్ఎం శుభ్రజ్యోతి మండల్ అతిథులుగా విచ్చేసి విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏటా పాఠశాల సాధిస్తున్న అత్యుత్తమ ఫలితాలు తూర్పుకోస్తా రైల్వే పరిధిలో విశేష గుర్తింపు సాధిస్తున్నాయని అతిథి వర్గం అభినందించింది.


విద్యార్థులు ప్రదర్శించిన కలహండి జానపద నృత్యం


ఒడిస్సీ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

కన్నుల ‘పండుగ’లా జరిపిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇచ్ఛాపురంలో పదేళ్లకు ఒకసారి జరిగే శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి పండగను విజయవంతం చేయాలని, నెల రోజుల పండుగలో ఒక్క అవాంఛనీయ ఘటన కూడా చోటు చేసుకోకూడదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులు, కమిటీకి సూచించారు. ఇచ్ఛాపురంలో ఈ నెల 17 నుంచి మే 15 వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ, అధికారులతో ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. పండుగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకూడదని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులకు, భక్తులకు అధికారుల సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రతి రోజూ వేల సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున తప్పిపోయిన వారికోసం, ఇతర సమస్యలు తెలియజేసేందుకు సమాచార కేంద్రాలను పలుచోట్ల ఏర్పాటుచేయాలని కోరారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం లేకుండా నిరంతరంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను చేయాలని, ఈ పండగ రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాణసంచా వినియోగంలో కమిటీ సభ్యులు పూర్తిభాద్యత వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కంట్రోల్ రూమును నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రతి రోజూ సుమారు 50 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున, సజావుగా జరిగేందుకు 250 మంది పోలీసులను మోహరిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం 113 నంబరుతో కంట్రోల్ రూముని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్యం కోసం 105 మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని అన్నారు. మొబైల్ టాయిలెట్లు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నామని, అధికారుల సహకారంతో ఇతర ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయి రాజ్, డీఆర్‌ఓ ఎం.రాజేశ్వరి, పలాస ఆర్డీఓ సీతారాంమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

కారు ధ్వంసం కేసులో యువకుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఈ నెల 9న అర్థరాత్రి అలజడి చేసిన యువకుడ్ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. నగరంలోని పలు కాలనీల్లో కార్ల అద్దాలను పగులగొట్టడమే కాకుండా.. అదేరోజు పెదబరాటం వీధిలో మోటారు సైకిల్ దొంగిలించిన కేసులో ఫాజుల్‌బేగ్‌పేట్‌కు చెందిన కోరాడ దుర్గాప్రసాద్ (20)ను బలగ కూడలి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. దుర్గాప్రసాద్ ఐటీఐ చదివి ఖాళీగా ఉంటూ వ్యసనాలకు లోనై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు.. సీసీ ఫుటేజీలో దృశ్యాల ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. దుర్గాప్రసాద్‌కు తోడు మరో వ్యక్తి కూడా ఉన్నాడని, అతనికోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కారులో దొంగిలించిన రూ. 2 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

పనివేళలపై ప్రభావం



ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ప్రమీల మల్లిక్

- రాష్ట్రమంతటా తీవ్రమైన వడగాలులు
- అధికారులతో మంత్రి ప్రమీలా మల్లిక్ సమీక్ష
- కార్యాలయాల్లో పనివేళలు మార్చుతూ నిర్ణయం

భువనేశ్వర్: రాష్ట్రమంతటా వడగాలుల తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. ఈ పరిస్థితులను గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షకు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి ప్రమీలా మల్లిక్ అధ్యక్షత వహించారు. ఈ వాతావరణ పరిస్థితుల్లో ప్రజా రవాణా సేవలను సవరించి నిరంతర విద్యుత్ సరఫరా పట్ల చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మార్కెట్ స్థలాలు, బస్టాండ్‌లు, రద్దీ ప్రదేశాలు వంటి ప్రాంతాల్లో చలివేంద్రాలు ప్రారంభించాలన్నారు. దీంతో పాటు నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు, గొట్టపు బావులు, పైపుల నీటి సరఫరా వ్యవస్థల పునరుద్ధరణ చర్యలతో నీటి కొరత సమస్యలు నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, తాగునీటి శాఖను ఆదేశించారు. ప్రాణాలను రక్షించే మందులు, సెలైన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను డిస్పెన్సరీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్ డివిజన్, జిల్లా హెడ్‌క్వార్టర్స్ ఆస్పత్రులలో అవసరాలకు అనుగుణంగా నిల్వ ఉంచాలని తెలిపారు. ఆస్పత్రులలో వడదెబ్బ రోగుల చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక వార్డులు, పడకలు కేటాయిస్తారు.

ఉదయం 7గంటల నుంచి..

విచ్చలవిడిగా సంచరించే జంతువులు, పశువుల కోసం ఎక్కడికక్కడ కుండీలు ఏర్పాటు చేసి తాగునీరు అందుబాటులోకి తేవాలని మత్స్య, పశువనరుల అభివృద్ధి శాఖలకు మంత్రి ఆదేశించారు. స్థానిక కమ్యూనిటీలు/వనసురక్షా సమితి/ పంచాయతీరాజ్ వ్యవస్థ సభ్యులు/స్వయం సహాయక బృందాలు, ఇతర కమిటీల సహాయ సహకారాలతో అడవుల్లో మంటల నివారణ చర్యలు చేపడతారు. వడగాడ్పుల బారి నుంచి వన్యప్రాణులను రక్షించడానికి వివిధ సామాజిక అవగాహన, చైతన్య కార్యక్రమాలు ప్రారంభిస్తారు. అలాగే ఒడిశా అంతటా వేడిగాలుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలలను(ప్రభుత్వ-ప్రైవేట్), అంగన్‌వాడీ కేంద్రాలను ఈనెల 16వరకు అత్యవసర సెలవులు ప్రకటించారు. ఈనెల 10నుంచి ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యాలయాల పని వేళలుగా ప్రకటించారు. పీక్ పీరియడ్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు కార్మికులకు పని వేళలను నివారించారు. ప్రత్యేక సహాయ కమిషనర్-అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత సాహు, వివిధ శాఖల ప్రిసిపల్ సెక్రటరీలు, భారత వాతావరణ విభాగం ప్రాంతీయ డైరెక్టర్, ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

తగ్గని వేడి..

రాష్ట్రంలోని 25 ప్రాంతాల్లో గురువారం 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. 8 ప్రాంతాల్లో 42 డిగ్రీలకు మించి రికార్డయ్యిందని స్థానిక ప్రాంతీయ వాతావరణ విభాగం కార్యాలయం తెలిపింది.

నిప్పు ముప్పు తప్పేలా..!


అగ్ని ప్రమాదాలు-నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

- అగ్ని ప్రమాదాల నిరోధానికి అవగాహన కార్యక్రమాలు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
- మాక్‌డ్రిల్స్‌కు సర్వం సిద్ధం

ఇచ్ఛాపురం రూరల్:

ఓ వైపు ఎండలు దంచేస్తున్నాయి. బయటకు రావాలంటేనే జనం భయపడుతున్నారు. ఇదే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాల తీవ్రతను తగ్గించి ప్రాణాలను, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్స్‌తో ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే అగ్నిప్రమాదాల నివారించవచ్చని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు.

అవగాహన సదస్సులు..

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అమర వీరులకు నివాళులు, 15న బహిరంగ ప్రదేశాలు, కూడళ్లలో అగ్నిప్రమాదాలు నివారణపై అవగాహన కల్పిస్తారు. 16న అపార్టమెంట్లు, 17న విద్యా సంస్థలు, 18న గ్యాస్ గొడౌన్స్, ఆయిల్ ఫార్మ్‌లు, 19న ఆస్పత్రుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ఏప్రిల్ 20న అన్ని వర్గాల ప్రజలకు ఫైర్ సేఫ్టీపై వర్క్‌షాప్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అందుబాటులో బుల్లెట్ సేవలు..


వేసవిలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు జిల్లా అగ్నిమాపక శాఖ సర్వం సిద్ధంగా ఉంది. ప్రమాద నివారణకు అవసరమైన పరికరాలు, యంత్రాలు, ఇంజన్లు సిద్ధంగా ఉన్నాయి. అడ్వాన్స్ వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజన్, రెస్క్యూ ఫైర్ ఇంజిన్, ట్రూప్ క్యారియర్, ఫైర్ బుల్లెట్ బైక్, మిస్ట్ జీప్‌లు అందుబాటులో ఉన్నాయి.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నెంబర్లు	
జిల్లా అగ్నిమాపకాధికారి	9949991052
సహాయక అగ్నిమాపకాధికారి	9949991053
ఇచ్ఛాపురం	08942-231101
సోంపేట	08947-234101
మందస	08947-237101
పలాస	08945-241101
టెక్కలి	08945-244277
కోటబొమ్మాళి	08942-238659
నరసన్నపేట	08942-276777
శ్రీకాకుళం	08942-220101
రణస్థలం	7032542833
పొందూరు	08941-242101
ఆమదాలవలస	08942-285401

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- చిన్న పిల్లలకు అగ్గి పెట్టెలు, లైటర్లు, టపాసులు వంటివి ఇవ్వకూడదు.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా దుప్పటి వంటివి చుట్టుకోవాలి.
- వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదు.
- మండుతున్న పొయ్యిపై వస్తువులను దూరం నుంచి అందుకోవాలని ప్రయత్నించవద్దు.
- మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయడం ప్రమాదకరం.
- చెడిపోయిన గ్యాస్ ట్యూబ్ స్థానంలో ఐఎస్ఐ మార్కు గల కొత్త ట్యూబ్‌ను అమర్చాలి.

నిబంధనలు పాటించాలి..



ఏప్రిల్ 14 నుంచి అగ్నిమాపక కేంద్రాల పరిధుల్లో వారోత్సవాలు నిర్వహించి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తాం. అత్యవసర సమయా ల్లో 101 నంబర్‌కు సమాచారం అందజేయాలి. బహుళ అంతస్తులు, పాఠశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, పరిశ్రమలు వంటి సంస్థల్లో అగ్నిమాపక పరికరాలు తప్ప నిసరిగా అందుబాటులో ఉంచాలి. నిబంధనలు పాటించకపోతే ఫైర్ సర్వీస్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– బి.వీరభద్రరావు, జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపకాధికారి, శ్రీకాకుళం

కోదండ రామునికి చక్కని కోవెల

- రామతీర్థం శ్రీకోదండ రామాలయ నిర్మాణం పూర్తి
- చెప్పిన మాట ప్రకారం క్లిష్ట పరిస్థితుల్లోనూ శరవేగంగా పనులు
- ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూ.4 కోట్ల నిధులు
- రూ.3 కోట్ల వ్యయంతో బోడికొండపై నిర్మాణాలు పూర్తి
- దిగువనున్న ప్రధాన ఆలయ అభివృద్ధికి రూ.కోటి నిధులు
- ప్రతిష్టాపన తర్వాత రేపు ప్రథమ వార్షికోత్సవం



నాడు: ఈ చిత్రం చూశారా... 2014 సంవత్సరంలో రామతీర్థంలోని నీలాచలమనే బోడికొండపైనున్న శ్రీ కోదండ రాముని ఆలయమే ఇది! నాటి చంద్రబాబు పాలన సమయంలో 2014 అక్టోబర్ 12వ తేదీన హుద్‌హుద్ తుపాను ధాటికి రామాలయం కూడా దెబ్బతిన్నది. ప్రహరీ అంతా కూలిపోయింది. ధ్వజస్తంభం నేలకొరిగింది. అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ నాయకుడు పూసపాటి అశోక్‌గజపతిరాజే ఈ ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్త కూడా. ధ్వజస్తంభం లేకుండానే ఆలయంలో స్వామివారికి నిత్య కైంకర్యాలు కొనసాగించడంపై అప్పట్లో హిందూమత సంఘాలు పెద్దఎత్తున నిరసన తెలిపాయి. అయినా చంద్రబాబు ప్రభుత్వం కోదండరాముడి ఆలయాన్ని బేఖాతరు చేసింది.



నేడు: 2023 సంవత్సరంలో నేటి చిత్రం ఇది. చెప్పిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునర్నిర్మించిన శ్రీ కోదండరామ ఆలయం ఇది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో భారీగా నిధులు కేటాయించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రత్యేక నిపుణులు, ఆగమ శాస్త్ర పండితుల పర్యవేక్షణలో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి చేయించారు. గర్భాలయం తరువాత అర్ధ మండపం, ముఖ మండపాలు రూపుదిద్దుకున్నాయి. ధ్వజస్తంభం పునరుద్ధరించారు. ప్రహరీ పూర్తయింది. గతంలో మాదిరి దుర్ఘటనలేవీ పునరావృతం గాకుండా సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు.



కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రామతీర్థం... ఉమ్మడి విజయనగరం జిల్లా వాసులే కాదు.. ఉత్తరాంధ్ర, ఒడిశాలోని ఆంధ్రా సరిహద్దు జిల్లాల ప్రజలు దర్శించుకునే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. స్వయంగా శ్రీరాముడే నడయాడిన ప్రదేశమని వారి విశ్వాసం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం తర్వాత అంతటి స్థలప్రాశస్త్యం ఉంది కాబట్టే ఇది రెండో భద్రాద్రిగా పేరుగాంచింది. శతాబ్దాల కిందట నిర్మించిన ఈ ఆలయ విశిష్టతను చాటే శిలాశాసనాలు, చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. దిగువనున్న శ్రీరాముని ప్రధాన ఆలయమే గాకుండా బోడికొండపై శ్రీకోదండరాముడి కోవెలకూ ఘన చరిత్ర ఉంది. ఏకశిలా పర్వతమైన ఆ నీలాచలం కొండపై శతాబ్దాల కిందటే ఆలయాన్ని నిర్మించారు. రామతీర్థం వచ్చిన భక్తులు దిగువన ఉన్న ప్రధాన ఆలయాన్ని సందర్శించిన తర్వాత ఈ కోదండరాముడినీ దర్శించుకుంటారు.

హుద్‌హుద్ తుపానుతో ధ్వంసం

హుద్‌హుద్ తుపాను ధాటికి కోదండరాముడి ఆలయం దెబ్బతింది. ప్రహరీ కూలిపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం దీన్ని బాగుచేయకపోవడంతో ఆలయానికి రక్షణ కరువైంది. ఫలితంగా మూడేళ్ల కిందట జరిగిన దారుణం జిల్లా ప్రజలను కలచివేసింది. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి చొరబడి స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అప్పటివరకూ ఆలయాన్ని విస్మరించిన టీడీపీ నాయకులు... ఈ దుర్ఘటనను మాత్రం ఎప్పటిలాగే రాజకీయాలకు వాడుకోవడానికి విఫల యత్నం చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రామతీర్థం ఘటనను సీరియస్‌గా తీసుకుంది. దుర్ఘటనపై ఒకవైపు దర్యాప్తు చేయిస్తూనే మరోవైపు ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టింది. రూ.3 కోట్ల నిధులను కేటాయించింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సహకారంతో సీతాసమేత శ్రీరాముడి కొత్త విగ్రహాలను తయారుచేయించింది. ఆ వెంటనే దిగువనున్న బాలాలయంలో స్వామి ధ్రువ మూర్తులను శాస్త్రోక్తంగా ప్రతిష్ట చేయించింది.

స్వామివారికి సుందరమైన ఆలయం



శ్రీకోదండరాముడికి చక్కని ఆలయం మళ్లీ సాకారమైంది. ఆగమ శాస్త్రం ప్రకారం పునఃప్రతిష్ట చేయించాం. స్వామికి నిరాటంకంగా నిత్య కైంకర్యాలను జరిపిస్తున్నాం. భక్తులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రతిష్టాపన తర్వాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నాం.

– సాయిరామాచార్యులు, ప్రధాన అర్చకుడు

ఆలయ నిర్మాణం పూర్తి అయిన వెంటనే గత ఏడాది ఏప్రిల్ 15వ తేదీన పునఃప్రతిష్ట చేయించింది. ఈనెల 15వ తేదీన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు...

ఆలయానికి శిలాఖండాలను బోడికొండపైకి చేర్చడం చాలా కష్టమైన ప్రక్రియ. ప్రత్యేకంగా ట్రాక్ వేసి ఒక్కొక్కటిగా కొండపైకి తీసుకెళ్లారు. చిత్తూరు జిల్లా కుప్పం, తమిళనాడు రాష్ట్రంలోని మధురైకు చెందిన 20 మంది కార్మికుల శ్రమతో కోదండరామునికి చక్కని కోవెల రూపుదిద్దుకుంది. విజయవాడలో ప్రత్యేకంగా తయారుచేయించిన ధ్వజస్తంభాన్ని శాస్త్రయుక్తంగా పునఃప్రతిష్ఠించారు. రూ.3 కోట్ల వ్యయంతో రామాలయంతో పాటు యాగశాల, వంటశాల, స్టోర్ రూమ్, ప్రహరీ కూడా నిర్మించారు. కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం కొండ పైకి మెట్లను పునర్నిర్మించారు.

రామతీర్థం అభివృద్ధి వైఎస్ కుటుంబ ఘనత



రామతీర్థం అభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిధులు ఇచ్చారు. వాటితో పలు అభివృద్ధి పనులు చేయించాం. మళ్లీ ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే భారీగా నిధులు కేటాయించారు. బోడికొండపై శిథిలమైన శ్రీకోదండరామ ఆలయాన్ని రూ.3 కోట్లతో నిర్మించారు. దిగువనున్న ప్రధాన ఆలయ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేశారు. మొత్తం రూ.4 కోట్ల నిధులు కేటాయించారు. అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన ఒక్క పని కూడా ఇక్కడ కనిపించదు.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే

ప్రధాన ఆలయంలో అభివృద్ధి పనులు...

రామతీర్థం ప్రధాన ఆలయ అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఆలయంలో శిథిలమైన ఫ్లోరింగ్‌ను తొలగించి కొత్తగా నిర్మించనున్నారు. యాగశాలకు శాశ్వత నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఉత్తర రాజగోపురం వద్ద సుందరీకరణ చేయనున్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. ఈనెలాఖరులోగా పనులు ప్రారంభిస్తామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉన్నాం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: కోవిడ్ ఫోర్త్ వేవ్ వ్యాప్తి నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి గురువారం తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. రోజుకి 200 మందికి కోవిడ్ పరీక్షలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఉన్న 48 పీహెచ్‌సీలు, జిల్లా కేంద్రంలో ఉన్న 11 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డయాలసిస్ రోగులు, కాలేయం మార్పిడి చేసుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కోవిడ్ భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని కోరారు. ఫంక్షన్లు, షాపింగ్ మాల్స్, ఆస్పత్రులకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం మంచిదని తెలిపారు.

ప్రశాంతంగా సైన్స్ పరీక్ష

- మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒకరు డీబార్

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని 127 కేంద్రాల్లో గురువారం పదోతరగతి సైన్స్‌పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రెగ్యులర్ విద్యార్థులు 24,076 మందికి 24,039 మంది, ప్రైవేటు విద్యార్థులు 1406 మందికి 1346 మంది హాజరయ్యారు. స్క్వాడ్ బృందాలు 63 పరీక్ష కేంద్రాలను, డీఈఓ 4, జిల్లాస్థాయి పరిశీలకులు 4 కేంద్రాలను తనిఖీ చేశారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని డీబార్ చేసినట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

26న క్యాంపస్ డ్రైవ్

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), హెచ్‌సీఎల్ టెక్నాలజీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని తోటపాలెంలో ఉన్న ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఈ డ్రైవ్ సాగుతుందన్నారు. హెచ్‌సీఎల్ టెక్‌బీకి ఇంటర్మీడియట్ 2022, 2023 సంవత్సరాల్లో 75 శాతానికి పైగా మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ముందుగా హెచ్‌సీఎల్ టెక్‌బీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 94929 27844, 63015 74739 నంబర్లను సంప్రదించాలన్నారు.

సంస్కృత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ మృతి



యనమండ్ర సూర్య నారాయణ (ఫైల్)

విజయనగరం టౌన్: ప్రముఖ రుగ్వేదాచార్యులు, మహారాజా సంస్కృత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ యనమండ్ర సూర్యనారాయణ అవధాని బుధవారం రాత్రి అన్నవరంలో శివైక్యం పొందారు. ఈ మేరకు ఆయన శిష్య బృందం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వందలాది మంది శిష్యులు అన్నవరం వెళ్లి సంతాపం తెలియజేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో శిష్యులు దూసి శివప్రసాద్, శంబర కృష్ణ తదితరులున్నారు.

ఈఓపీఆర్‌డీకి మెమో జారీ

కురుపాం: కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న చప్పా లక్ష్మున్నాయుడుకు మెమో జారీ చేసినట్టు కురుపాం ఎంపీడీఓ వి.వి.శివరామప్ప తెలిపారు. సాల్వెన్స్ సర్టిఫికెట్ కోసం గిరిజనుల నుంచి రూ.1500 వసూలు చేయడంపై ఈ నెల 12వ తేదీన 'ఆ అధికారి రూటే సెప'రేటు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ స్పందిస్తూ మెమో జారీచేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సాల్వెన్స్ సర్టిఫికెట్ కోసం డబ్బులు డిమాండ్ చేయడంపై సస్పెండ్ ఎందుకు చేయకూడదనే అంశంపై వివరణ కోరుతూ మెమోజారీ చేశామన్నారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ స్థానంలో వేరొకరిని కురుపాం మండల ఈఓపీఆర్‌డీగా నియమించాలని డీపీఓను కోరామన్నారు.

ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్లో పోక్సో కేసు నమోదు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైనట్లు దిశ డీఎస్పీ హర్షిత తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా, బాలికకు వైద్య సేవలందించిన వైద్యులు అందించిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కురుపాం మండలానికి చెందిన బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుక్కల దాడిలో 10 మేకపిల్లల మృతి

బలిజిపేట: మండలకేంద్రంలో కుక్కల దాడిలో 10మేకపిల్లలు మృతి చెందాయి. గ్రామంలో గొల్లవీధికి చెందిన ఎం.సన్యాసి తన మేకపిల్లలను ఇంటి సమీపంలో ఉన్న శాలలో ఉంచాడు. బుధవారం రాత్రి 4కుక్కలు వాటిపై దాడి చేయడంతో అవి మృతి చెందినట్టు బాధితుడు తెలిపారు. సుమారు రూ.60వేల వరకు నష్టం జరిగిందని వాపోయాడు. పశువులపై కూడా కుక్కలు దాడి చేస్తున్నాయని, అధికారులు, పంచాయతీ పాలకులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

- జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు



నెల్లిమర్ల:

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 16వ తేదీన రాతపరీక్ష జరగనుందని గురుకులాల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. జిల్లాలోని నెల్లిమర్ల, విజయనగరం, గంట్యాడ, కొత్తవలస, గజపతినగరం, బొబ్బిలి ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అభ్యర్థులంతా ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. ఇప్పటికే హాల్ టిక్కెట్లను ఆన్‌లైన్లో అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు హెచ్‌టీటీపీ://బీఐటీ.ఎల్‌వై/ఎంజేపీఏపీ బీసీవెల్ఫేర్‌పిఫ్త్‌క్లాస్‌హాల్‌టిక్కెట్స్2023 అనే లింక్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఏడు పాఠశాలల్లో ప్రవేశాలకు మొత్తం 1150 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించారు. 440 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

నెల్లిమర్ల బాలికల పాఠశాలకు 191 మంది, మత్స్యకార బాలుర పాఠశాలకు 18 మంది, గజపతినగరం బాలుర పాఠశాలకు 145 మంది, విజయనగరం బాలుర పాఠశాలకు 90 మంది, బొబ్బిలి బాలుర పాఠశాలకు 227 మంది, గంట్యాడ బాలికల పాఠశాలకు 199 మంది, కొత్తవలస బాలికల పాఠశాలకు 280 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న పాఠశాలల్లోనే ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు.

టెన్నిస్ పోటీల్లో జిల్లా వెటరన్స్ సత్తా



విశాఖలో జరిగిన టెన్నిస్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా వెటరన్స్ క్రీడాకారులు

విజయనగరం: విశాఖ వేదికగా జరిగిన ఆలిండియా టెన్నిస్ పోటీల్లో జిల్లా వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు విశాఖలోని సెంచరీ క్లబ్‌లో జరిగిన వెటరన్స్ పోటీల్లో 45 సంవత్సరాల వయస్సు విభాగంలో సింగిల్స్‌లో పోటీపడిన టి.రామారావు హైదరాబాద్‌కు చెందిన డి.సతీష్‌బాబుపై విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకున్నారు. అలాగే డబుల్స్ విభాగంలో టి.రామారావు-ఎంవీఎల్ఎన్ రాజులు ద్వితీయ స్థానంలో నిలిచారు. 35 సంవత్సరాల వయస్సు విభాగంలో డబుల్స్‌లో పోటీ పడిన సుదర్శన్‌రాజు, కె.భానుచంద్రలు మహారాష్ట్ర జట్టుపై విజేతగా నిలిచి ప్రథమ స్థానం కై వసం చేసుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందించారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



లక్ష్మణరావును సర్వజన ఆస్పత్రికి తీసుకువెళ్తున్న 108 సిబ్బంది

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి-సుభద్రాపురం ప్రధాన రహదారిలో పుర్రేయవలస జంక్షన్ వద్ద ఓ కారు అదుపు తప్పి సమీపంలో ఉన్న దుకాణంలోకి దూసుకుపోయింది. ఈ మేరకు హెడ్‌కానిస్టేబుల్ జీవీ రమణ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. చీపురుపల్లికి చెందిన మజ్జి భాస్కరరావు తన కారులో శ్రీకాకుళం వెళ్తుండగా పుర్రేయవలస జంక్షన్ వద్ద కారు అదుపు తప్పి, అదే సమయంలో బైక్‌పై చీపురుపల్లి పట్టణం వైపు వెళ్తున్న పుర్రేయవలసకు చెందిన గురాన లక్ష్మణరావు, కుమారుడు హర్ష(బాలుడు)ను ఢీకొట్టాడు. అదే సమయంలో నడుచుకుంటూ వస్తున్న వృద్ధుడు నిద్దాన సత్యాన్ని ఢీకొని సమీపంలో మూసి ఉన్న దుకాణంలోకి కారు దూసుకుపోయింది. ఈ ఘటనలో లక్ష్మణరావు ఎడమ చెయ్యి విరగడంతో విజయనగరం సర్వజన ఆస్పత్రికి 108లో తీసుకువెళ్లారు. నిద్దాన సత్యం కుడికన్ను, కుడి మోకాలికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాసులు నాయుడు పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఆయా ప్రమాదాలపై మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

డెంకాడ: మండలంలోని రఘుమండ శివాలయం సమీపంలో టీవీఎస్ ఎక్సెల్ అదుపు తప్పి గోతిలో పడిపోవడంతో పూసపాటి రేగ మండలంలోని పిట్టపేటకు చెందిన పిట్టా అప్పన్న(55) మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై మహేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. బొడ్డవలసలో పండుగ చూసుకుని స్వగ్రామమైన పిట్టపేటకు టీవీఎస్‌పై అప్పన్న వెళ్తుండగా మార్గమధ్యంలో రఘుమండ వద్ద అదుపు తప్పి గోతిలో పడి మృతి చెందాడు. మృతుడి కుమారుడు పైడిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

వడదెబ్బతో వేతనదారు..



పరామర్శిస్తున్న ఏపీఓ రామకృష్ణ



సత్యవతి(ఫైల్)

గురుగుబిల్లి: మండలంలోని నాగూరుకు చెందిన ఎచ్చర్ల పార్వతి(46) వడదెబ్బకు గురై మృతి చెందింది. గురువారం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులలో ఆమె పాల్గొంది. పనులు ముగించుకుని 11 గంటలకు ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికి తీవ్ర అస్వస్థతతకు గురై మృతిచెందినట్లు భర్త సత్తిశెట్టి తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఏపీఓ రామకృష్ణ నాగూరు వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ. 50వేలు ఎక్సగ్రేషియో అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కె.శిరీష తదితరులు అధికారులను కోరారు.

గుండెపోటులో కలాసీ..



భామిని: పీహెచ్‌సీలో విలపిస్తున్న కుటుంబసభ్యులు

భామిని: మండల కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాంలో గురువారం బియ్యం బస్తాలు దించుతున్న తరుణంలో జట్టు కలాసీ ఆనంద్ గౌడో(38) అకస్మాత్తుగా కింద పడి మృతి చెందాడని సాటి కలాసీలు విలపిస్తూ తెలిపారు. కింద పడిన కలాసీ ఆనంద్ గౌడోను దగ్గరలోని భామిని పీహెచ్‌సీకి తీసుకు వెళ్లినప్పటికే ఊపిరి ఆగిపోయనట్లు వైద్యులు నిర్ధారించారు. కాట్రగడ-బి గ్రామానికి చెందిన మృతుడు ఆనంద్‌గౌడో కొద్ది నెలలుగా భామిని ఎఫ్‌సీఐ గోదాంలో కలాసీగా పనిచేస్తున్నాడు.వైద్యుల నిర్ధారణ అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం కాట్రగడ తరలించారు, మృతుడికి భార్య భానుగౌడో, ముగ్గురు పిల్లలున్నారు.

రెండిళ్లు దగ్ధం

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలో షార్ట్ సర్క్యూట్‌తో పతివాడ తిరుపతిరావుకు చెందిన రెండు వరుస ఇళ్లు కాలిపోయాయి. ఈ ప్రమాద సమాచారం అందిన వెంటనే పట్టణ అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో తన కుమార్తెకు చెందిన సర్టిఫికెట్లు, రూ.40వేల నగదు, 12 ధాన్యం బస్తాలు కాలిపోయాయని ఫిర్యాదులో తిరుపతిరావు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. అయితే ఎవరికీ ఎటువంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పురిటిపెంటలో ధాన్యం పురి..

గజపతినగరం: మండలంలోని పురిటి పెంటలో ధాన్యం పురి, పశువుల శాల కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన బీడీ, సిగరెట్ అంటుకోవడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్, స్థానిక పెద్దలు అభిప్రాయ పడ్డారు. గ్రామానికి చెందిన దాసరి సన్ని తాత పశువుశాల, ధాన్యం పురి ఈ ప్రమాదంలో కాలిపోయాయి.

నగదు చోరీ నిందితుడి అరెస్ట్

- మరో ముగ్గురు పరారీ
- రూ.7 లక్షలు రికవరీ చేసిన సీసీఎస్ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజు

విజయనగరం క్రైమ్: మోటార్ బైక్ డిక్కీలో పెట్టుకున్న డబ్బును చోరీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న నలుగురు వ్యక్తులలో ఒకరిని సీసీఎస్ పోలీసులు పట్టుకుని రూ.7 లక్షల నగదు రికవరీ చేశారు. ఈ మేరకు సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజు గురువారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా రాజాం, కొత్తవలస పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో బైక్ డిక్కీల నుంచి నగదు చోరీకి పాల్పడిన నలుగురు ముఠా సభ్యుల్లో చిత్తూరు జిల్లా ఓజీకుప్పం గ్రామానికి చెందిన 70 ఏళ్ల కేజీ సుబ్రహ్మణ్యాన్ని సీసీఎస్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా సభ్యులు బ్యాంకులో కస్టమర్లుగా వ్యవహరిస్తూ, బ్యాంక్ లావాదేవీలు చేస్తున్న వ్యక్తులను గమనించి, నగదు డ్రా చేసి, మోటారు బైక్ డిక్కీలో పెట్టుకునే వారిని టార్గెట్ చేసి, ఎక్కడైనా ఏదైనా పనిమీద వారు ఆగినప్పుడు వెంటనే తమ చేతులకు పనిచెప్పి, నగదు కాజేస్తారు. ఇదే తరహాలో రాజాం, కొత్తవలస పట్టణాల్లో నేరాలకు పాల్పడ్డారు. మిగిలిన ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామమని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీసీఎస్ ఎస్సై సాగర్‌బాబు, హెచ్‌సిలు ఎం.డి. ఇమ్రాన్, దాసరి శంకరరావు, రాజాం కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కొత్తవలస కానిస్టేబుల్ గొరినాయుడులను సీసీఎస్ సీఐ అభినందించారు.

స్వధార్ హోం నుంచి ఇద్దరు అమ్మాయిల పరారీ

- కేసు నమోదు చేసిన పోలీసులు



స్వధార్‌హోం సూపరింటెండెంట్ కమలతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని స్వధార్ హోంలో ఉంటున్న ఇద్దరు అమ్మాయిలు పరారయ్యారు. వారిలో ఒకరు మైనర్ కాగా, మరొకరు మేజర్. నిరాదరణకు గురైన మహిళలకు స్వధార్ హోంలో రక్షణ, సంరక్షణ కల్పిస్తారు. ఫిబ్రవరి 24 వతేదీన బాలల సంక్షేమ కమిటీ వారు విజయనగరానికి చెందిన 17 ఏళ్ల బాలికకు తాత్కాలిక పునరావాసం కల్పించాలని స్వధార్ హోం నిర్వాహకులను ఆదేశించారు. దీంతో ఆ బాలిక అప్పటి నుంచి స్వధార్‌హోంలో ఉంటోంది. విశాఖపట్నానికి చెందిన 19 ఏళ్ల యువతి మార్చి 31వ తేదిన స్వధార్ హోంలో చేరింది. వారిద్దరూ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో స్వధార్ హోంలో వారు ఉంటున్న గది కిటికీ వంచి పరారయ్యారు. దీంతో స్వధార్ హోం సూపరింటెండెంట్ కమల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వధార్ హోం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈసంఘటన జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని స్వధార్ హోం సూపరింటెండెంట్ కమల వద్ద సాక్షి ప్రస్తావించగా అమ్మాయిలిద్దరు నవ్వుతూ ఉండేవారని, ఎందుకు వెళ్లిపోయారో తెలియడం లేదన్నారు.

పరిశీలించిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్

బాలికలు పరారైన విషయం తెలుసుకున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు గురువారం స్వధార్ హోంను పరిశీలించారు. సంఘటన గురించి ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాలు తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు.

పోగొట్టుకున్న రూ.3 లక్షలు బాధితులకు అందజేత



నగదు అందిస్తున్న, సీఐ శ్రీనువాసరావు

సాలూరు: బ్యాంకులో విత్‌డ్రా చేసిన డబ్బులు మార్గమధ్యంలో పొగొట్టుకున్న బాధితురాలికి పోలీసులు గురువారం నగదు అందించారు. దీనిపై పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అఫీషియల్ కాలనీకి చెందిన శాంతకుమారి బుధవారం ఎస్‌బీఐలో రూ.3 లక్షలు విత్‌డ్రా చేసుకుని ఇంటికి పయనమైంది. ఇంటికి వెళ్లిన తరువాత ఆమె దగ్గర డబ్బుల బ్యాగు లేకపోవడంతో పోయాయని గ్రహించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు మార్గమధ్యంలో ఆమె పొగొట్టుకున్న నగదును గుర్తించి గురువారం అందజేశారు. పోయిన డబ్బు మళ్లీ చేతికి అందడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ఎస్సైలు పాపారావు, నారాయణలు ఉన్నారు.